వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

చెదిరిన అమెరికా కల

అమెరికా కల అనేది ఓ వందేండ్లుగా వాడుకలో ఉన్న మాట. ఇప్పుడు ఆ కలకు నూరేండ్లు నిండుతున్నట్టున్నాయి. ముఖ్యంగా భారతీయులకు. అధికారికంగా వెళ్లినవారికీ, అనధికారికంగా వెళ్లినవారికీ పెద్ద తేడా ఏం లేదు ఈ విషయంలో. అమెరికాకు పూర్వ వైభవం సాధిస్తాననే నినాదంతో పోటీ చేసి అసాధ్యమైన రీతిలో రెండో విడత అధికారం చేజిక్కించుకున్నారు డొనాల్డ్ ట్రంప్. ఆయన వైట్ హౌజ్‌లోకి అడుగు పెట్టీ పెట్టకుండానే ఫర్మానాలను శరపరంపరగా విసురుతున్నారు. అందులో అతి ముఖ్యమైనవి శరణార్థులకు, ప్రవాస జీవులకూ సంబంధించినవి. దేశ దేశాల నుంచి ఎవరెవరో వచ్చి తిష్ఠ వేసి, సుష్టుగా డాలర్లు సంపాదించేసి అమెరికన్లకు ఆదాయం, ఉద్యోగాల్లే కుండా చేస్తున్నారనేది ఆయన బాధ. అందుకే అమెరికాలోకి అక్రమ వలసల నిరోధానికి సరిహద్దులను కట్టుదిట్టం చేశారు. నిబంధనలను కఠినతరం చేశారు. పత్రాల్లే కుండా దొరికినవాళ్లను దొరికినట్టు సైనిక విమానాల్లో పంపి ఆయా దేశాలకు అప్పగించేస్తున్నారు. బుధవారం అమృత్‌సర్‌లో దిగిన సీ-17 విమానంలో వంద మందికి పైగా భారతీయ అక్రమవలసదారులు ఆ కోవలోకే వస్తారు. వారి కాళ్లకు, చేతులకు సంకెళ్లు వేసి తీసుకువచ్చారు. ఇదంతా దొడ్డిదారిన వెళ్లినవారి గోల.

రాజమార్గంలో వెళ్లినవారిది వేరే కథ. వారినీ రకరకాల సమస్యలు వేధిస్తున్నాయి. కొన్నాళ్ల కిందటి వరకూ డెలివరీల సమయంలో తోడుగా ఉండేందుకు తల్లిదండ్రులను అమెరికాకు తీసుకువెళ్లే సంప్రదాయం జోరుగా సాగేది. ఆ గడ్డ మీద పురుడు పోసుకుంటే ఆటోమెటిక్‌గా అమెరికా పౌరసత్వం వస్తుందనే భరోసాయే అందుకు కారణం. ఇప్పుడా వెసులుబాటు లేదు. ఒక్క కలం పోటుతో ట్రంప్ దాన్ని రద్దు చేసేశారు. ఎప్పుడో 150 ఏండ్ల కిందట నల్లజాతి బానిసల కోసం రూపొందించిన నిబంధనను నాకంటే నాకని ఎగబడి వాడేసుకుంటున్నారని ట్రంప్ అక్కసు. అమెరికా పౌరసత్వం తరతరాలుగా (కనీసం కొలంబస్ సముద్ర మార్గం కనిపెట్టిన తర్వాత వచ్చిపడ్డ యూరోపియన్ వలసదారులకు) ఉంటున్నవారికే జన్మతః పౌరసత్వం చెందాలనేది ఆయనకు తోచిన దేశభక్తి. దాంతో ఫిబ్రవరి 19వ తేదీ నుంచి ఈ సౌకర్యం నిలిపివేస్తున్నట్టు ఫర్మానా జారీచేశారు. అంతే. ఆ తేదీలోపు ఎన్నారైలు బలవంతపు డెలివరీలు ఆగమేఘాల మీద చేయించుకోవడం విడ్డూరమే. అయితే, ఇదంతా వృథాయాసమే అయ్యింది. ట్రంప్ ఫర్మానాలను కోర్టులు అంతే వేగంతో పక్కన పెడుతున్నాయి. ఈ నేపథ్యంలో అసలు అమెరికన్లు ఎవరు? అనే మౌలిక ప్రశ్న కూడా ముందుకు వస్తున్నది.

తాజాగా భారతీయులు ఎంతగానో కోరుకునే వర్క్ వీసా వ్యవస్థను దెబ్బతీసే దిశగా ట్రంప్ నిర్ణయం తీసుకోబోతున్నారనే వార్తలు ఆ వీసా కింద అమెరికాలో నివసిస్తున్న వారిలో, ఆశావహుల్లో గుబులు పుట్టిస్తున్నది. ఇదివరకటి జో బైడెన్ హయాంలో కల్పించిన హెచ్-1 బీ, ఎల్-1 వీసాల ఆటోమెటిక్ రెన్యువల్ సౌకర్యాన్ని రద్దు చేస్తారని అంటున్నారు. ఈ వీసాల లబ్ధిదారుల్లో భారతీయులే అధికంగా ఉంటారు. కనుక వారి మీదే దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందనేది తెలిసిందే. అమెరికా రాజకీయాల్లో భారతీయుల ప్రభావం పెరిగిందని ఓ వైపు సంబురపడాలో, పౌరసత్వంలో పరాయీకరణ చెందడం గురించి ఆందోళన చెందాలో తెలియని పరిస్థితి వచ్చిపడింది. అమెరికా ముంగిట భారతీయత ఇలా అగ్ని పరీక్షకు గురవుతుంటే కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం మౌనముద్ర దాల్చడం మరో విషాదం.

కులగణనపై 'లెక్క' లేనితనం!

ఘోర తపస్సు చేసి సంపాదించిన వరమే చివరికి భస్మాసురుడిని కాల్చి బూడిద చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామంటూ 2023 కామారెడ్డి డిక్లరేషన్‌లో హామీనిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్.. ఇప్పుడు ఆ హామీపై యూటర్న్ తీసుకోవడం.. భస్మాసుర హస్తంగా మారనున్నదా? కులగణన కాకి లెక్కలే.. ఆ పార్టీని అధఃపాతాళానికి తొక్కేయనున్నాయా? రాష్ట్రంలో జరుగుతున్న తాజా పరిణామాలను విశ్లేషిస్తే... అవునన్న సమాధానాలే వినిపిస్తున్నాయి.

14 నెలల రేవంత్ పాలనపై తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అటకెక్కించడం అటుంచితే.. కూల్చివేతలు, కబ్జాలు, రైతులు, సామాన్యుల ఆక్రందనలతో రాష్ట్రమంతా అల్లకల్లోలంగా మారిపోయింది. సీఎంగా పగ్గాలు చేపట్టినప్పటి నుంచి కేసీఆర్ కుటుంబసభ్యులపై స్కామ్‌ల పేరిట అభాండాలు వేస్తూ పబ్బం గడుపుకొన్న సీఎం రేవంత్ రెడ్డి.. తన ప్రభుత్వం ఆత్మరక్షణలో పడిన ప్రతీ సందర్భంలోనూ డైవర్షన్ పాలిటిక్స్‌తోనే నెగ్గుకొచ్చారు. ఇవన్నీ పసిగట్టిన తెలంగాణ బిడ్డలు.. సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం ఎట్లుండె? ఇప్పుడెట్లయ్యిందంటూ పోల్చి చూసుకోవడం ప్రారంభించారు. అందుకే, కాంగ్రెస్ అధికారికంగా నిర్వహించిన పోల్‌లో 'మాకు కేసీఆర్ పాలనే నచ్చిందం'టూ పల్లె నుంచి పట్నం వరకూ.. నాగలి పట్టిన రైతన్న నుంచి ల్యాప్‌టాప్ పట్టిన టెకీ వరకూ ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. ఇది కాంగ్రెస్ నాయకులకు ఎంత మాత్రం రుచించలేదు. అయితే, క్షేత్రస్థాయిలో వాస్తవాన్ని మాత్రం వాళ్లు విస్మరించే స్థితిలోనూ లేరు. ప్రజల అసమ్మతి ఇలాగే కొనసాగితే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గట్టెక్కడం కష్టమని రాష్ట్ర నాయకత్వం గుర్తించింది. ఎన్నికల్లో పార్టీ అస్తిత్వాన్ని కాపాడుకోవాలంటే బహుజనుల ఆదరణను చూరగొనడమే ఏకైక మార్గమని భావించింది. ఈ క్రమంలోనే గత నవంబర్‌లో నిర్వహించిన సమగ్ర కులగణన సర్వేను తెరమీదకు తీసుకొచ్చింది. బీసీల జనాభాపై అసెంబ్లీ సాక్షిగా కాకి లెక్కలను వల్లె వేసింది. ఇప్పుడు అదే ఆ పార్టీకి భస్మాసుర హస్తంగా పరిణమించింది.

తప్పుడు సర్వే టు యూటర్న్: 'మేమెంతో మాకంత వాటా'.. ఇదీ బీసీల చిరకాల స్వప్నం. అయితే, కాంగ్రెస్ సర్కారు తాజాగా ప్రవేశపెట్టిన కులగణన లెక్కలు బీసీల ఆశలను చిదిమేశాయి. రాష్ట్రంలో బీసీల జనాభా 46.25 శాతమేనని, ముస్లిం బీసీలు 10.08 శాతంతో కలుపుకొంటే బీసీల మొత్తం జనాభా 56.33 శాతం కూడా దాటడం లేదని రేవంత్ ప్రభుత్వం కాకి లెక్కలను వల్లె వేసింది. కులగణన పేరిట బీసీలను తక్కువ చేసి చూపించిన ఈ నివేదికపై బీఆర్ఎస్ సహా బీసీ సంఘాలు భగ్గుమన్నాయి. వెనుకబడిన వర్గాలను నమ్మించి గొంతు కోయడమేంటని నిలదీశాయి. ఈ లెక్కలపై సాక్షాత్తూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ మొదలు సీనియర్ నేతలు కూడా భిన్నస్వరాలు వినిపించారు. ముప్పేట దాడి పెరిగిన నేపథ్యంలో అసలు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు సాధ్యమయ్యేనా? అనే ప్రశ్నలు వెల్లువెత్తాయి. ఇదే సమయంలో కాంగ్రెస్ తన అసలు బుద్ధిని బయటపెట్టుకొన్నది. బీసీ రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తామని.. ఒప్పుకొంటేనే అమలుచేస్తామని యూటర్న్ తీసుకొన్నది. లేదంటే పార్టీపరంగా రిజర్వేషన్లు కల్పిస్తామంటూ చేతులు దులుపుకొన్నది. కాంగ్రెస్ ప్రకటనపై బహుజనులు ధ్వజమెత్తారు. అసెంబ్లీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీని తుంగలో తొక్కిన కాంగ్రెస్‌కు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తామని బీసీ నేతలు అల్టిమేటం జారీచేశారు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల ఓట్లు రాబట్టేందుకు తెరమీదికి తెచ్చిన 'బీసీ కులగణన' అంశం భస్మాసుర హస్తంగా మారిందంటూ కాంగ్రెస్‌పార్టీకి చెందిన సీనియర్ నేత ఒకరు ఉసూరుమనడం గమనార్హం.

సందేహాల పుట్ట: కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన కులగణన సర్వేపై సామాజికవేత్తలు, బీసీ సంఘాల నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర జనాభాలో బీసీల వాటా 46.25 శాతం మాత్రమే ఉన్నదంటూ నివేదిక వెల్లడించడాన్ని తప్పుబడుతున్నారు. క్షేత్రస్థాయిలో సర్వే మొత్తం తప్పులతడకగా కొనసాగిందని మండిపడుతున్నారు. 2023లో బీహార్‌లో చేపట్టిన కులగణన సర్వేలో బీసీల వాటా ఆ రాష్ట్ర జనాభాలో ఏకంగా 63.14 శాతంగా ఉన్నదని గుర్తుచేస్తున్నారు. అయితే, తెలంగాణలో మాత్రం ఇది 46.25 శాతానికి (ముస్లిం బీసీలతో కలిపి 56.33 శాతం) పరిమితం కావడమేమిటని ప్రశ్నిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఎన్యుమరేటర్లు అరకొర సమాచారాన్నే సేకరించారని, శాస్త్రీయత లేకుండా నిర్వహించిన ఈ సర్వేతో తెలంగాణలోని బీసీలకు తీవ్రమైన అన్యాయం జరుగుతున్నదని బీసీ సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2023 జనవరిలో బీహార్‌లోని నితీశ్ సర్కారు కులగణన సర్వేను చేపట్టింది. ఆ నివేదిక ప్రకారం.. బీహార్ మొత్తం జనాభా 13,07,25,310గా తేలింది. దీంట్లో ఓబీసీల జనాభా 3,54,63,936 (27.12 శాతం) కాగా ఈబీసీల జనాభా 4,70,80,514 (36.01 శాతం)గా లెక్కగట్టారు. మొత్తంగా రాష్ట్రంలో బీసీల జనాభా 8,25,44,450 (63.14 శాతంగా తేల్చారు. అంటే బీహార్ రాష్ట్రంలోని ప్రతీ 100 మందిలో 63 మంది బీసీలేనని అర్థమవుతున్నది. అయితే, తెలంగాణలోని కులగణన నివేదిక ప్రకారం... రాష్ట్రంలోని ప్రతీ 100 మందిలో 46 మంది మాత్రమే బీసీలుగా తేల్చారు. ఇదే బీసీ సంఘాల నేతలకు ఆగ్రహాన్ని తెప్పిస్తున్నది. ప్రతీ రాష్ట్రంలో బీసీల జనాభా శాతాల్లో ఒక ట్రెండు అంకెలు తేడాలుండవచ్చేమో గానీ.. బీహార్ బీసీలతో పోలిస్తే, తెలంగాణ బీసీ జనాభా ఏకంగా 17 శాతం వరకూ తేడా ఉండటమేమిటని నిలదీస్తున్నారు. మొత్తానికి తెలంగాణలో కులగణన సర్వే తప్పుల తడకగా సాగిందని మండిపడుతున్నారు.

రాహుల్ అందుకనే అలా అన్నారా?: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సోమవారం పార్లమెంట్‌లో మాట్లాడుతూ... తెలంగాణలో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీల జనాభా దాదాపు 90 శాతం వరకూ ఉన్నదని వెల్లడించారు. ఇది తనకు ఒకింత షాక్‌కు గురిచేసినట్టు చెప్పుకొచ్చారు. దేశవ్యాప్తంగా కులగణన జరపాలని పనిలో పనిగా ఓ స్టేట్‌మెంట్ కూడా ఇచ్చారు. అయితే, తెలంగాణలో జనరల్ క్యాటగిరీ కాకుండా మిగిలిన వర్గాలవారి సంఖ్యను 90 శాతానికి పెంచిన రాహుల్.. బీసీల జనాభా ఎంత ఉన్నదన్న విషయాన్ని ప్రత్యేకంగా ఎందుకు ప్రస్తావించలేదని బీసీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. కులగణన పేరిట బీసీల సంఖ్యను తక్కువ చేసి చూపించిన రేవంత్ ప్రభుత్వ నిర్వాకం బయటపడొద్దన్న ఉద్దేశంతోనే మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీల జనాభానను బీసీలతో కలిపి మొత్తంగా 90 శాతంగా ఏమార్చే ప్రయత్నాలకు రాహుల్ తెగబడ్డారని విమర్శిస్తున్నారు.

ఇదిలా ఉంటే కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో ఏడేండ్ల కిందట సిద్ధమైన కులగణన నివేదిక లెక్కలు ఇప్పటికీ బయటకు రాలేదు. వెరసి అటు కర్ణాటకలో అయినా, ఇటు తెలంగాణలో అయినా.. దేశం మొత్తంగా చూసినా.. బీసీలపై కాంగ్రెస్ ఒలకబోస్తున్న ఆప్యాయత సవతి తల్లి ప్రేమేనని విశ్లేషకులు అంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందడానికి బీసీ కులగణనను తెరమీదికి తీసుకొచ్చి ప్రయోజనాలు పొందాలనుకొన్న తెలంగాణ కాంగ్రెస్ పాచిక.. భస్మాసుర హస్తంగానే మారిపోయిందని అభిప్రాయపడుతున్నారు.

- ఎడిటోరియల్ డెస్క్

> **ఊసరవెల్లే ఉలిక్కిపడేలా...**
>
> కులగణన, బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోపే బీసీ రిజర్వేషన్లు పెంచుతాం. స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న 23 శాతం రిజర్వేషన్లను 42 శాతానికి పెంచి 23,973 మంది బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తాం. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణను అమలుచేస్తాం.
>
> **- కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానం**
>
> బీసీ రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపిస్తాం. ఒప్పుకొంటే అమలుచేస్తాం. లేదంటే పార్టీపరంగా రిజర్వేషన్లు కల్పిస్తాం.
>
> **- అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ మాటమార్పు**

అధికారంలో ఉన్నా అబద్ధాలే అస్త్రాలు

డాక్టర్ బీఎన్ రావు
98668 34717

ప్రజాస్వామ్యంలో అధికార పక్షంతో పాటు ప్రతిపక్షానికి ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. అధికార పక్షం చేసే తప్పులను ఎత్తిచూపడంలో విపక్షానిదే కీలకపాత్ర. ప్రజల తీర్పును శిరసావహిస్తూ తమను నమ్మి అప్పగించిన ప్రతిపక్ష పాత్రను బీఆర్ఎస్ సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నది. సర్కారు తప్పులను ఎత్తిచూపుతూనే.. మంచి పనులను మెచ్చుకుంటూ హుందాగా వ్యవహరిస్తున్నది. అందుకే ఏడాది తిరగకముందే ప్రజలు బీఆర్ఎస్‌కు మళ్లీ బ్రహ్మరథం పడుతున్నారు. ఏడాది ప్రజాపాలనకు రెఫరెండంగా కాంగ్రెస్ పార్టీ తన అధికారిక 'ఎక్స్'లో హ్యాండిల్‌లో నిర్వహించిన పోల్‌లో వచ్చిన ఫలితాలే అందుకు నిదర్శనం.

స్వరాష్ట్ర సాధనే లక్ష్యంగా పురుడు పోసుకొని ఉమ్మడి ఏపీలో నాడు తెలంగాణ పక్షం వహించినా.. గత పదేండ్లపాటు తెలంగాణ అభివృద్ధే ధ్యేయంగా, ప్రజాసంక్షేమ మే పరమావధిగా అధికారపక్షం పాత్రను సమర్థవంతంగా నిర్వర్తించినా.. కొట్లాడి సాధించుకున్న తెలంగాణను నేడు ప్రతిపక్ష హోదాలో కాపు కాస్తున్నా అది బీఆర్ఎస్‌కే చెల్లింది. నాడైనా, నేడైనా.. అధికారపక్షమైనా, ప్రతిపక్షమైనా తెలంగాణే తమ తొలి ప్రాధాన్యమని బీఆర్ఎస్ చాటి చెప్తున్నది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేసీఆర్ తమ పార్టీ శ్రేణులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ప్రజల తీర్పును గౌరవించి కొత్త ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని శ్రేణులను ఆదేశించారు. అధినేత చెప్పినట్టుగానే బీఆర్ఎస్ శ్రేణులు ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇస్తూ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్రను పోషిస్తున్నారు.

అయితే, కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన 100 రోజుల గడువు పూర్తవడంతో ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలు కోసం బీఆర్ఎస్ సమరశంఖం పూరించింది. సర్కారు వెంటపడి మరీ ఒక్కొక్కటిగా పథకాలు అమలుచేసేలా చేస్తున్నది. ఈ క్రమంలో ఉద్యమ పార్టీ మొదటినుంచి నిజాన్ని నిజమనీ, అబద్ధాన్ని అబద్ధమనే చెప్తున్నది. ఎన్నడూ దుష్ప్రచారాలు, విష ప్రచారాల జోలికి పోలేదు. కాంగ్రెస్ సర్కారు అమలుచేసిన పథకాల విషయంలో బీఆర్ఎస్ నిజాయితీగానే వ్యవహరిస్తున్నది. ఉచిత బస్సు పథకం అమలు చేశారనే అంటున్నది. రుణమాఫీ కోతలు కొర్రీలతో సుమారు 40 శాతం వరకు అమలు చేశారని చెప్తున్నది. అదే సమయంలో మిగతా పథకాలు అమలు చేయాలంటూ సర్కారుపై ఒత్తిడి తెస్తున్నది. అందుకే ఇటీవల కోతలతోనైనా రైతుభరోసా ఎకరానికి రూ.12,000 ఇచ్చేందుకు కాంగ్రెస్ ముందుకువచ్చింది. గతంలో రుణమాఫీ విషయంలోనూ దాటవేత ధోరణి అవలంబించిన రేవంత్ సర్కారు మెడలువంచి అమలయ్యేలా చేసింది.

కాంగ్రెస్ మాత్రం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వ్యవహరించినట్టే ఇప్పుడు, అధికారంలో ఉన్నప్పుడు కూడా వ్యవహరిస్తున్నది. గద్దెనెక్కినా తన తీరు మార్చుకోవడం లేదు. అబద్ధాల పునాదులపై ఏర్పడిన సర్కార్‌ను అబద్ధాలతోనే నిలబెట్టుకోవాలని ఆ పార్టీ చూస్తున్నది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నాటి కేసీఆర్ సర్కార్‌పై ఎంతలా దుష్ప్రచారం చేసిందో అందరికీ తెలిసిందే. కాళేశ్వరం కూలిపోయిందని, లక్ష కోట్లు గోదారి పాలయ్యాయని, 90 వేల కోట్ల ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని.. లేనిపోని విష ప్రచారం చేశారు. రైతన్నలకు పెట్టుబడి సాయం కోసం తీసుకొచ్చిన బృహత్తర పథకం రైతుబంధుపై కూడా దుష్ప్రచారం చేశారు. ప్రగతిభవన్‌లో లంకె బిందెలున్నాయని, 150 గదులున్నాయని కనీస సోయి లేకుండా మాట్లాడారు. ఇలా చెప్పుకొంటూ పోతే కాంగ్రెస్ నాయకులు నాడు చేసిన విష ప్రచారాలు ఎన్నెన్నో. కనీసం బాధ్యతాయుతమైన పదవిలో వచ్చాకైనా వారు మారడం లేదు. ఇంకా ఎక్కువే దుష్ప్రచారం చేస్తున్నారు. మొదటి నుంచి డైవర్షన్లు, లీకులు, గత ప్రభుత్వంపై దుష్ప్రచారం, కుట్రలు, కుయుక్తుల మీదనే పాలన సాగిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో దేశంలోనే మార్గదర్శకంగా నిలిచిన పథకాలు, అభివృద్ధి పనులపై ఇప్పటికీ విషం చిమ్ముతూనే ఉన్నారు. బీడు భూముల్లో బంగారం పండేలా చేసిన కాళేశ్వరంపై, చిమ్మచీకట్ల తెలంగాణలో వెలుగులు నింపిన 24 గంటల విద్యుత్తుపై కమిషన్ల పేరిట కుట్రలు చేస్తున్నారు. కాళేశ్వరం కూలిపోయిందని చెప్పి ఇప్పుడు సిగ్గు లేకుండా అదే ప్రాజెక్టు నుంచి నీళ్లు వదులుతున్నారు. రాళ్లు, రప్పలకు రూ.20 వేల కోట్లు రైతుబంధు ఇచ్చారని ఒకరు, కొండలకు, కోనలకు రూ.50 వేల కోట్లు తగిలేశారని మరొకరు ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ రైతులకు పెట్టుబడి సాయం అందకుండా పన్నాగం పన్నుతున్నారు. డబుల్ బెడ్రూం విషయంలోనూ ఇలాగే వ్యవహరించారు. ఆ ఇండ్ల నాణ్యత బాగాలేదని గతంలో విమర్శించి ఇప్పుడు అవే ఇండ్లను మూసీ బాధితులకు పంచుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గత పదేండ్లలో ఆరున్నర లక్షలకు పైగా రేషన్ కార్డులు ఇవ్వగా.. ఒక్కటీ ఇవ్వలేదని బుకాయిస్తున్నారు. కేసీఆర్ సర్కార్ భర్తీచేసిన ఉద్యోగాలకు నియామక పత్రాలిచ్చి గప్పాలు కొట్టడమే కాకుండా, బీఆర్ఎస్ సర్కార్ 1.60 లక్షలకు పైగా ఉద్యోగాలు ఇచ్చినా.. ఒక్క ఉద్యోగం ఇవ్వలేదని యువతను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇలా బాధ్యతను మరిచి బరితెగించి అబద్ధాలు చెప్తున్నారు. ప్రభుత్వంలో ఉన్నామన్న బాధ్యత లేదు. జవాబుదారీతనం అసలే లేదు. నిజం చెప్పాలన్న ఆలోచన లేదు. వాస్తవాలు వెల్లడించాలన్న ధ్యాసే లేదు. పారదర్శకత పాటించాలన్న పట్టింపే లేదు. బీఆర్ఎస్‌ది ఫామ్‌హౌజ్ పాలన అని, కేసీఆర్ ఎవరికీ అపాయింట్మెంట్ ఇవ్వరని, బీఆర్ఎస్ నేతలకు అహంకారం పెరిగిందని గతంలో లేనిపోని విష ప్రచారం చేశారు. ఇప్పుడు అలాగే చేయాలని చూశారు. కానీ, తెలివైన తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ సర్కార్‌కు కర్రు కాల్చి వాత పెట్టారు. కర్షకులను కంటికి రెప్పలా కాచుకునే ఫార్మర్ పాలన కావాలని.. ప్రజలను పీడించే ప్రజాపాలన వద్దని కరాఖండిగా చెప్పారు.

(వ్యాసకర్త: బీఎన్‌రావు ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యులు)



పుండు మీద కారం చల్లడమే

> మన పౌరులకు సంకెళ్లు వేసి, చెయిన్లతో కట్టి సైనిక విమానాల్లో తరలించడం భారత్‌కు ఘోర అవమానం. అప్పటికే మానసికంగా కుంగిపోయి వస్తున్నవారి గాయాలకు మందు రాయాల్సిందిపోయి.. మోదీజీ నాయకత్వంలోని హర్యానా ప్రభుత్వం ఖైదీలను తీసుకెళ్లే వ్యాన్లలో ఎయిర్‌పోర్టు నుంచి వారిని తరలించింది. ఇది ముమ్మాటికీ పుండు మీద కారం చల్లడమే.
>
> **- భగవంత్‌సింగ్ మాన్, పంజాబ్ సీఎం**

పిల్లకాకికేం తెలుసు ఉండేలు దెబ్బ

ట్విటర్ పోలింగ్ ద్వారా కాంగ్రెస్ సెల్ఫ్‌గోల్ చేసుకున్న విషయం తెలిసిందే. ఆ పోలింగ్‌లో అధికార కాంగ్రెస్ పార్టీకి అతి స్వల్పంగా ఓట్లు పోల్ కాగా, బీఆర్ఎస్ పార్టీకి ఎక్కువగా ఓట్లు పోల్ అయ్యాయి. దీంతో కంగుతిన్న కాంగ్రెస్ పార్టీకి దిమ్మతిరిగి మైండ్ బ్లాకయిపోయింది. మరునాడు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జహీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆ సమావేశంలో అధికార పక్షాన్ని ఉద్దేశించి 'నేను కొడితే మామూలుగా ఉండదు' అని హెచ్చరించడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సహా అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుల వెన్నులో వణుకు పుట్టింది. దటీజ్ కేసీఆర్. ఆ మాటలు కేసీఆర్ ఆషామాషీగా చెప్పలేదు. ఆయన కొట్టిన దెబ్బలకు చరిత్రే సాక్ష్యం.

అయినా.. పిల్ల కాకికేం తెలుసు ఉండేలు దెబ్బ అన్నట్టు కేసీఆర్ దెబ్బ రేవంత్ రెడ్డికి ఎలా తెలుస్తుంది. తమ అధినేత్రి సోనియా గాంధీ, గురువు చంద్రబాబులకు బాగా తెలుసు. కేసీఆర్ కొడితే మామూలుగా ఉండదని నేనెందుకు చెప్తున్నానంటే.. అందుకు ఎన్నో ఉదాహరణలున్నాయి. 2001లో డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేసి టీడీపీ నుంచి బయటికి వచ్చినప్పుడు అందరూ కేసీఆర్‌ను హేళన చేశారు. మంత్రి పదవి రాలేదని తెలంగాణ రాగమందుకున్నారని విమర్శించారు. కానీ, తెలంగాణ సాధించాలన్న లక్ష్యాన్ని తన నరనరాన ఎక్కించుకున్న కేసీఆర్ స్వరాష్ట్ర సాధనే ఏకైక ఆశయంగా 2001లో టీఆర్ఎస్‌ను స్థాపించి 2014 జూన్ 2న తెలంగాణ సాధించారు. ఇది సమైక్యాంధ్ర నాయకులకు కేసీఆర్ కొట్టిన పెద్ద దెబ్బ.

తెలంగాణ వస్తే చీకటిమయమవుతుందని ఉమ్మడి ఏపీ చివరి సీఎం కిరణ్ కుమార్‌రెడ్డి కేసీఆర్ కొట్టిన దెబ్బతో పాపం కనుమరుగైపోయాడు. అంతెందుకు తెలంగాణ రాష్ట్రాన్ని అస్థిరపరచాలని నాడు చంద్రబాబు నాయుడు చేయని కుట్రలు లేవు. ఆయన కుయుక్తులను పసిగట్టిన కేసీఆర్ కోలుకోలేని దెబ్బకొట్టారు. ఆయన దెబ్బకు చంద్రబాబు హైదరాబాద్‌ను వదిలి పలాయనం చిత్తగించారు. అంతటితో ఆగకుండా 2018లో మరోసారి తెలంగాణ వ్యతిరేక పార్టీ అయిన కాంగ్రెస్‌తో జతకట్టి కేసీఆర్‌పై దండయాత్ర చేయాలని చూశారు. ఈసారి కొట్టిన దెబ్బతో తెలంగాణలో సైకిల్ పంచరై పాత ఇనుప సామాన్లకు కూడా పనికిరాకుండా పోయింది. ఇప్పుడు విర్రవీగుతున్న రేవంత్‌రెడ్డి కూడా కేసీఆర్ కొట్టే దెబ్బకు కనుమరుగు కావడం ఖాయం. నల్లారి వారికి పట్టిన గతే, ఎనుముల వారికి పడుతుంది. అదెంతో దూరం లేదు సుమా.

- గ్యాదరి బాలమల్లు, కార్పొరేషన్ మాజీ చైర్మన్

ఎంతకాలమీ వంచనలు

మాటలకు మామిడిచెట్ల పూతలు
చేతలకు మొద్దువారుతున్న కొడవళ్లు
కామారెడ్డి డిక్లరేషన్ని గద్దలెత్తుకపాయే
మార్చురీ గదుల్లో కమిటీలు కులగణనలు

అబద్ధాల నాటకాలకు తెరతీయండి
ముఖాలకు రంగులు పులమండి
బంగారు కిరీటాలకు మెరుగులు దిద్దండి
రాజకీయాలెప్పుడూ మోసాలేనా...
మేమెప్పుడూ ప్రేక్షకులుగానేనా...
చాతాడు తెగి బావిలో పడ్డట్టు

ఏ పునాదికీ రాళ్లెత్తని వాళ్లు
రాజులై భోగిస్తున్నారు
ములుగర్రలతో రథాలను ఉరికిస్తున్నారు
శతాబ్దాలుగా పెద్దోళ్ల ముంగిటిలో వెలుగులు
పేదల వాకిళ్లలో చీకట్లు

నమ్మకాల గోడలకు పర్రెలు
వాడిపోయిన పూల ఆశయాలు
స్వప్నాల మొగిలిపొదలో బుసబుసలు
చరిత్రలకో పేజీలేకుండా
చెరువుల్లో అలరాకుండా
రచ్చకట్టిన కుర్చీ దక్కనీయకుండా
బీసీల ప్రాతినిధ్యాల్ని అణచేస్తున్నారు
ఎన్నాళ్లీ బురద రాజకీయాలు?

కాల్చిన చింతోల కాయలు
గంపకెత్తిన ఎండు చాపలు
కడవల కొద్దీ కల్లు ముంతలు
కాలిన చేతుల్లో రాతికడీలు
బీగాలు పెట్టెలు పూసలు అద్దాలు
విరిగిన మగ్గాలు తొవ్వలేని గొర్ల మందలు
వొట్టి యాదులేనా?

ఎంతకాలమీ వంచనలు
బీసీలంటే బువ్వకుండలు
కల్లుగీతలు కుంపటేలు కొలుములు,
వడ్ల దాకలి చాకలిరేవులు
మంగలి అసిపెలు.
కొండంత సమూహ